క్లుప్తంగా

ఎమ్మెల్యే దొంతి పూజలు



నర్సంపేట : అసోంలోని గుహవాటిలోని పుణ్యక్షేత్రమైన 'మా కామాఖ్య' అమ్మ వారి ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి గురువారం కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు ఎమ్మెల్యే కుటుంబానికి ఘన స్వాగతం పలికారు. అర్చకులు ఆశీర్వదించారు.

ఘనంగా తీజ్ వేడుకలు



దుగ్గొండి : మండలంలోని వెంకటాపురం గ్రామ శివారులోని మంగలితండాలో గిరిజనులు తీజ్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. గత 10 రోజుల క్రితం గొర్ల పోశమ్మ వేడుక అనంతరం మంచె ఏర్పాటు చేసి దానిపై వెదురు బుట్టల్లో గోధుమలు వేసి 9 రోజుల పాటు బతుకమ్మ పండుగ తరహాలో సాయంత్రం ఆటపాటలతో వాటికి నీరు పోశారు. ఏపుగా పెరిగిన గోధుమ బుట్టలను మేళతాళాలు, డప్పు చప్పుళ్లతో ఊరి చివర చెరువు వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కుల పెద్ద ధరావత్ రాజయ్య, గిరిజనులు పాల్గొన్నారు.

భోజ్యానాయక్‌తండాలో..



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని భోజ్యానాయక్‌తండాలో తీజ్ వేడుకలను నిర్వహించారు. గిరిజన మహిళలను గోధుమ బుట్టలు తలపై పెట్టుకుని డప్పుచప్పుళ్లు, డీజే సౌండ్స్ నడుమ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గోధుమ బుట్టలను గ్రామ చెరువులో నిమ్మజ్జనం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సన్మానం



నర్సంపేట రూరల్ : బీఆర్ఎస్ యూత్ నర్సంపేట మండల సహాయ కార్యదర్శిగా ఎన్నికైన రామవరం గ్రామానికి చెందిన జినుకల అఖిల్‌ను ఆ పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. అఖిల్ రాజకీయంగా మరిన్ని పదవులు చేపట్టి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు కోమాండ్ల గోపాల్‌రెడ్డి, మోతె పద్మనాభరెడ్డి, కోడారి రవి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జినుకల విజేందర్, లక్నెపల్లి మాజీ సర్పంచ్ గోడిశాల రాంబాబు, లక్నెపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు పాతకాల కొమ్మాలు, తదితరులు పాల్గొన్నారు.

ఏరువాక కార్డుల పంపిణీ

పర్వతగిరి : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కార్యాలయంలో రైతులకు మండల వ్యవసాయ అధికారి (ఏఓ) ప్రశాంత్‌కుమార్ గురువారం ఏరువాక కార్డులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్డులో రైతులు తీసుకున్న రుణం, బకాయి, తదితర వివరాలు ఉంటాయని తెలిపారు. కార్డులను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, నాయకులు ఎర్రబెల్లి వెంకటేశ్వర్‌రావు, బుర్ర పుల్లారెడ్డి, పీఏసీఎస్ అధికారి సురేశ్, డి.సంపత్, తదితరులు పాల్గొన్నారు.

'పింఛన్ పెంపులో నిర్లక్ష్యం సరికాదు'

పర్వతగిరి : రాష్ట్ర ప్రభుత్వం వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్ పెంచడంలో నిర్లక్ష్యం చేయడం సరికాదని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు, జిల్లా ఇన్‌చార్జి వంగూరి ఆనందరావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు వెంటనే పింఛన్ పెంచి అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు. ఈనెల 29న వరంగల్‌లో తలపెట్టిన మహాసభకు వృద్ధులు, వికలాంగులు, వితంతువులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా సీనియర్ నాయకుడు జిల్లా ధర్మయ్య, మండల అధ్యక్షుడు బర్ల యాకయ్య, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు బొమ్మెర రాజు, నాయకులు జీడి ప్రసాద్, రాజయ్య యాదవ్, శిరబోయిన సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ హాస్టల్‌లో సమస్యల తిష్ట

- మెనూ అమలుకు నోచుకోని దుస్థితి
- ట్యూటర్ తీరుతో విద్యార్థుల బెంబేలు

సంగెం : మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్‌లో సమస్యలు తిష్ట వేశాయి. మెనూ సైతం అమలుకు నోచుకోవడం లేదు. వార్డెన్ నగేశ్ అనారోగ్యం కారణంగా సెలవులో ఉండగా ఆయన విధులను అనధికారికంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ట్యూటర్ తీరుతో విద్యార్థులు బెంబేలెత్తుతున్నారు. ఆయన తాళాలు తన వద్దే ఉంచుకుంటూ సరుకులు ఇవ్వకుండా మెనూ అమలు కానివ్వడం లేదని తెలుస్తోంది.

మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్‌లో 35 మంది విద్యార్థులు వసతి పొందుతూ వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. మొత్తం 31 బెడ్లు మాత్రమే ఉండగా విద్యార్థులు ఇరుకిరుకుగా సర్దుకుంటున్న పరిస్థితి నెలకొంది. హాస్టల్ గదుల కిటికీలు విరిగిపోయాయి. కొన్ని గదులకు తలుపులు లేవు. వర్షాకాలం నేపథ్యంలో దోమల బెడద పెరిగింది. విద్యుత్ స్విచ్ బోర్డులు మొత్తం మరమ్మతుకు గురయ్యాయి. ఫ్యాన్లు చాలా నెమ్మదిగా తిరుగుతున్నాయి. తాగునీటి కోసం మినరల్ వాటర్ ప్లాంట్ సామగ్రి సమకూరినప్పటికీ దాన్ని బిగించిన దాఖలాల్లేక ఉత్సవ విగ్రహాన్ని తలపిస్తోంది. కిటికీలకు జాలీ లేకపోవడంతో విద్యార్థులు రాత్రి వేళల్లో



ట్యూటర్ లేకుండా చదువుకుంటున్న విద్యార్థులు

దోమలతో ఇబ్బంది పడుతున్నారు. అనారోగ్య కారణంతో వార్డెన్ నగేశ్ విధులకు హాజరు కాకపోతుండగా ట్యూటర్‌గా వ్యవహరిస్తున్న శ్రీనివాస్ వార్డెన్ విధులనూ నిర్వర్తిస్తున్నట్లు విమర్శలున్నాయి.

ట్యూటర్ ఇష్టారాజ్యం..!

వార్డెన్, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ట్యూటర్ ట్యూటర్ శ్రీనివాస్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు విద్యార్థులు వాపోతున్నారు. మెనూ అమలు చేయడం లేదని పలువురు తల్లిదండ్రులూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు అల్పాహారం, స్నాక్స్, కూరగాయాలు అందడం లేదు. నీళ్ల చారుతో భోజనం చేయలేక పోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని అడిగిన విద్యార్థులపై ట్యూటర్ శ్రీనివాస్ భౌతిక దాడికి, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు విద్యార్థులు వాపోయారు. విద్యార్థులు చదువుకుంటున్న స్కూళ్లలో ఫిర్యాదు చేసి టీసీ ఇప్పించి వెళ్లగొడతానంటూ బెదిరిస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. విద్యార్థులకు సబ్బులు, కాస్మొటిక్స్, కటింగ్ డబ్బులు సైతం అందలేదు.

విద్యార్థులపై వేధింపులు



ట్యూటర్ శ్రీనివాస్ విద్యార్థులపై వేధింపులకు పాల్పడుతున్నాడు. మా పిల్లలిద్దరూ మూడేళ్లుగా ఈ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. వార్డెన్ సెలవులో ఉండడంతో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం కూడా అందించడం లేదు. తల్లిదండ్రులు పిల్లలకు ఇళ్ల నుంచి పచ్చళ్లు తెచ్చి ఇవ్వాల్సి వస్తోంది. సంబంధిత శాఖల అధికారులు సమగ్ర విచారణ చేపట్టి ట్యూటర్‌పై చర్యలు తీసుకోవడంతోపాటు విద్యార్థులకు మెనూ అమలయ్యేలా చూడాలి. వసతులు కల్పించాలి.

– అద్దంకి కిశోర్, పేరెంట్

అసంక్రమిత వ్యాధులతో జాగ్రత్త



వర్ధన్నపేట : వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నేహా ఫాతిమా

- పీహెచ్‌సీ వైద్యాధికారి నేహా ఫాతిమా

వర్ధన్నపేట : అసంక్రమిత వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర (పీహెచ్‌సీ) వైద్యాధికారి నేహా ఫాతిమా కోరారు. మండలంలోని ఎస్ఎస్ తండాలో గురువారం నిర్వహించిన వైద్యశిబిరంలో ఆమె పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మధుమేహం, రక్తపోటు, కేన్సర్, తదితర దీర్ఘకాలిక వ్యాధులను అసంక్రమిత వ్యాధులుగా గుర్తించాలని సూచించారు. ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, శుభ్రమైన ఆహారం తీసుకోవాలని, ఒత్తిడికి దూరంగా ఉండాలని, తదితర సూచనలు చేశారు. కార్యక్రమంలో రాయపర్తి ఎంఎల్‌హెచ్‌పీ జ్ఞాన సుందరి, సీహెచ్‌ఓ కమలా గ్రేస్, హెచ్‌వీ జి.స్వర్ణకుమారి, హెచ్‌ఏ మత్యాస్ శ్యామ్, ఏఎన్ఎంలు అరుణ, అనిత, ఆశవర్కర్లు ఉమ, భాగ్య, అరుణ, సరిత, సంధ్య, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యురాలు

అవగాహనతోనే ఆరోగ్య పరిరక్షణ

నర్సంపేట : అవగాహన పెంచుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని చెన్నారావుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి సరోజ తెలిపారు. చెన్నారావుపేటలోని సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో ఆమె విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడారు. విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ భద్రయ్య, వైద్య సిబ్బంది పుష్ప, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో దంత సంరక్షణ కీలకం

- ఆస్పత్రి సూపరింటెండెంట్ నర్సింహస్వామి

వర్ధన్నపేట : ఆరోగ్యం బాగుండాలంటే దంత సంరక్షణ కీలకమని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి తెలిపారు. పట్టణంలోని ఎస్టీ బాలికల హాస్టల్‌లో ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐసీపీఏ కంపెనీ సహకారంతో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరానికి నర్సింహస్వామి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నపిల్లలు దంతాల సంరక్షణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. చిన్నారుల్లో పాలపళ్లు, శాశ్వత పళ్ల వ్యత్యాసాలతో ఎగుడుదిగుడుగా వస్తాయని చెప్పారు. ఆర్నెళ్లకోసారి దంత వైద్యులను సంప్రదించాలని చెప్పారు. డాక్టర్ భరత్‌రెడ్డి మాట్లాడుతూ చిన్న పిల్లలు చిన్న సైజ్ బ్రష్‌లు, ప్రత్యేకించిన పేస్టులను మాత్రమే వాడాలని తెలిపారు. అనంతరం విద్యార్థినులకు ప్రత్యేకించిన పేస్టులు, బ్రష్‌లు, మౌత్‌వాష్‌లు, తదితరాలు అందజేశారు.



మాట్లాడుతున్న డాక్టర్ నర్సింహస్వామి

'వన్డే యాస్ సైంటిస్ట్'కు ఎంపిక



నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'వన్డే యాస్ సైంటిస్ట్' కార్యక్రమానికి పట్టణంలోని గీతాంజలి హైస్కూల్ పదో తరగతి విద్యార్థి ఎం.హర్షవర్ధన్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణలో హర్షవర్ధన్‌ను ప్రిన్సిపల్ గూడూరు ప్రవీణ్‌కుమార్, గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. 'మన్ కీ బాత్' కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ విద్యార్థులు ప్రయోగశాలలో ఒక రోజు శాస్త్రవేత్తగా గడపాలని సూచించారని చెప్పిన క్రమంలో దేశంలోని సీఎస్ఐఆర్‌కు చెందిన 37 ప్రయోగశాలల్లో జులై 21 నుంచి 25 వరకు ప్రతిభావంతులైన విద్యార్థులకు అవకాశం కల్పించగా హర్షవర్ధన్‌కు హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్‌కు చెందిన ఎన్‌జీఆర్ఐ పరిశోధన కేంద్రంలో పరిశోధన వాతావరణాన్ని పరిచయడం చేశారని, శాస్త్రవేత్తలతో చర్చించే అవకాశం కలిపించారని తెలిపారు.

లైబ్రరీ ఏర్పాటుతో నైపుణ్యాల పెంపు

- ఎంఈఓ బైరి సరళ

నర్సంపేట : పాఠశాలల్లో లైబ్రరీల ఏర్పాటుతో విద్యార్థుల్లో పఠనా నైపుణ్యాలు పెంపొందుతాయని ఎంఈఓ బైరి సరళ తెలిపారు. చెన్నారావుపేట స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం మానుపాటి పాపమ్మ అధ్యక్షతన మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు గురువారం నిర్వహించిన ప్రైమరీ లెవల్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఎంఈఓ సరళ అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలల్లో లైబ్రరీకి గది ఏర్పాటు చేయడంతోపాటు పీరియడ్‌ను కేటాయించాలని చెప్పారు. గ్రంథాలయ కమిటీని ఏర్పాటు చేయాలని తెలిపారు. స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్‌పర్సన్ గ్రంథాలయ నిర్వహణపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అన్ని పాఠశాలలో ఎఫ్ఆర్ఎస్, ఎఫ్ఎల్ఎన్ యూ డైస్ ప్లస్ డేటా, విద్యాశాఖ కార్యక్రమాలను తప్పకుండా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రావు, కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్రటరీలు రవీందర్‌రెడ్డి, ఈర్య, రిసోర్స్‌పర్సన్‌లు రవి, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సరళ

పేదల సంక్షేమానికి ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

నల్లబెల్లి : పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి తెలిపారు. మండలంలోని గొల్లపల్లి, కొండాపూర్ గ్రామాల్లో పార్టీ గ్రామ కమిటీల అధ్యక్షులు ఎర్ర నాగరాజు, కొండ నారాయణ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశాలకు తిరుపతిరెడ్డి హాజరై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులు గెలిచే దిశగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకుడు చార్ల శివారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు వైనాల అశోక్, ఇస్తారి శేఖర్, ప్రధాన కార్యదర్శి మాలోత్ మోహన్, బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దూరి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



నర్సంపేట : చెన్నారావుపేటకు చెందిన భూషబోయిన సతీశ్‌కు మంజూరైన రూ.18 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆయనకు నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నన్నెబోయిన రమేశ్ యాదవ్ గురువారం పంపిణీ చేశారు. అనంతరం రమేశ్ మాట్లాడారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లపెల్లి నర్సయ్య గౌడ్, మెంతుల రమేశ్, చెవ్వ వెంకన్న, కృష్ణారెడ్డి, గుగులోతు రవి, యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్క రాజు, నాయకులు గుగులోతు నాని, కోల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తాచాటాలి

- బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే శ్రీరాములు

ఖానాపురం : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని ఆ పార్టీ పూత. మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు శ్రేణులకు సూచించారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ అన్ని వర్గాల సంక్షేమానికి అనేక పథకాలు, కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తోందని చెప్పారు. శ్రేణులు నిత్యం ప్రజల్లో ఉంటూ కేంద్రంలోని బీజేపీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల ఓట్లు పోలయ్యేలా చూడాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు రాధారపు అశోక్, జల్లి మధు, ఆబోతు రాజు, సహదేవ్, విజయ్, యాక సాయన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



నర్సంపేట : వినతిపత్రం ఇస్తున్న నాయకులు



నెక్కొండలో..

- యూఎస్‌పీసీ నాయకుడు రాయబోస్

నర్సంపేట రూరల్ : ఉపాధ్యాలు ఎదుర్కొంటున్న, విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) నాయకులు మహ్మద్ రాయబోస్, సర్దార్, ఈదుల వీరస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నర్సంపేట తహసీల్దార్ కార్యాలయ అధికారికి గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రాయబోస్, సర్దార్, వీరస్వామి మాట్లాడారు. బదిలీల, ఉద్యోగోన్నతుల షెడ్యూల్ ప్రకటించి నిర్వహించడంతోపాటు 40 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులను ఏర్పాటు చేసేలా జీఓ నంబర్ 25ను సవరించాలని, 2023 నుంచి పీఆర్‌సీ అమలు చేయాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూఎస్‌పీసీ నాయకులు కొర్ర రమేశ్, కూనమల్ల కొమ్మాలు, నంద గోపాల్, బుచ్చిరాములు, రమేశ్, కుమారస్వామి, రాజు, రమేశ్, శోభన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కమిటీ మండల బాధ్యుడు జాన్‌నాయక్ మాట్లాడారు. సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం మొండివైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు బాలాజీ నాయక్, పాక శ్రీనివాస్, దాసరి కుమారస్వామి, యాదగిరి, రఘు రామయ్య, రేణుక, జోగయ్య, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శిని నియమించాలి

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని జల్లి గ్రామానికి పంచాయతీ కార్యదర్శిని నియమించాలని ఎస్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం రమేశ్ కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో గ్రామస్తులు మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ అయేషా పర్వీన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రమేశ్ మాట్లాడారు. గ్రామానికి పంచాయతీ కార్యదర్శి లేక ఏడాదిగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) దృష్టికి తీసుకెళ్లగా కొద్ది రోజుల క్రితం పంచాయతీ కార్యదర్శిని నియమించినా ఆయన విధుల్లో చేరలేదన్నారు. వెంటనే పంచాయతీ కార్యదర్శిని నియమించి గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొర్ర మోహన్, నూనె తిలక్, జరుపుల ప్రవీణ్, మెరుగు లెనిన్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలోనే పల్లెల అభివృద్ధి

- జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : బీజేపీ పాలనలోనే పల్లెలు అభివృద్ధి చెందుతాయని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఖానాపురం, చెన్నారావుపేట మండలాలకు చెందిన పలువురు బీజేపీలో గురువారం చేరగా వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. కార్యకర్తలందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటామని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇస్తున్న నిధులతో రాష్ట్రంలోని గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపు దిశగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ఖానాపురం మండల అధ్యక్షుడు రాధారపు అశోక్, ప్రధాన కార్యదర్శులు సహదేవ్, విజయ్, ఉపాధ్యక్షులు యాక స్వామి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఎర్ర రాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ దుంకదువ్వ రంజిత్, మండల ప్రధాన కార్యదర్శులు మురహరి విజయ్, సాంబ రాజు, నాయకులు లింగబత్తుల యాక సాయన్న, మల్లారెడ్డి, శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



కండువాలు కప్పుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



నర్సంపేట : కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, రాయపర్తి, ఖానాపురం, నల్లబెల్లి, దుగ్గొండి, నెక్కొండ, వర్ధన్నపేట, పర్వతగిరి, సంగెం, గీసుకొండ మండలాల్లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, ఆ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు కేక్‌లు కట్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పలు చోట్ల మొక్కలు నాటారు. మంత్రిగా కేటీఆర్ అందించిన సేవలను వివరించారు. కార్యక్రమాల్లో జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, మాజీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు రాయిడి రవీందర్‌రెడ్డి, జిల్లా నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, నామాల సత్యనారాయణ, నాగెల్లి వెంకటనారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

దుగ్గొండి : మండలంలోని చాపలబండకు చెందిన సోనబోయిన శాంతమ్మ (80) మృతి చెందగా ఆమె మృతదేహానికి మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మెపా మండల అధ్యక్షుడు ఓరుగంటి తిరుపతి, ముత్యాల స్వామి, సంకెళ్ల స్వామి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పర్వతగిరి : మండలంలోని ఏనుగల్లుకు చెందిన ఎర్రబెల్లి నిర్మల ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు పరామర్శించారు. తొలుత మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గుండవరపు అంజన్‌రావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ బాధ్యుల ప్రమాణ స్వీకారం



క్లబ్ బాధ్యులను సన్మానిస్తున్న భరత్, తదితరులు

నర్సంపేట : రోటరీ క్లబ్ స్థానిక ప్రెసిడెంట్‌గా బాదం రంజిత్‌కుమార్, సెక్రటరీగా శ్రీరాం కిరణ్, కోశాధికారిగా డాక్టర్ పడాల రాహుల్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా డాక్టర్ భరత్‌బాబు, అసిస్టెంట్ గవర్నర్ నరేశ్ హాజరై మాట్లాడారు. అనంతరం క్లబ్ ప్రెసిడెంట్ రంజిత్‌కుమార్ మాట్లాడారు. సామాజిక సేవలు అందిస్తామన్నారు. క్లబ్ బాధ్యులను సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు కంది గోపాల్‌రెడ్డి, నంద్యాల కృష్ణారెడ్డి, గోపు జైపాల్‌రెడ్డి, ఇరుకు కోటేశ్వర్‌రావు, మోతె జైపాల్‌రెడ్డి, బి.సుమన్, నామాల సత్యనారాయణ, సిద్ధ సుధాకర్, చకిలం కృష్ణమూర్తి, తదితరులు హాజరయ్యారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి

రాయపర్తి : ఈనెల 30, 31 తేదీల్లో వరంగల్‌లో నిర్వహించనున్న సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మేకల రవి కోరారు. మండల కేంద్రంలో బొట్ల శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన పార్టీ మండల శాఖ నాల్గో మహాసభకు రవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు అనేక హామీలు ఇచ్చి ఓట్లు దండుకుని గద్దెనెక్కిన కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీలు మోసపూరిత పాలన సాగిస్తున్నాయని చెప్పారు. పేదలు మరిన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పాలకులు అవలంభిస్తున్న తప్పుడు విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని శ్రేణులకు సూచించారు. తొలుత పార్టీ జెండా ఎగరేశారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు బాషుమియా, పనాస ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యుడు సంగి ఎలేందర్, నాయకులు అక్బర్ తదితరులు పాల్గొన్నారు.